క్లుప్తంగా

నంబర్ ప్లేట్ లేకుండా వాహనం రోడ్డెక్కితే సీజ్



నందిగామ: ప్రతి వాహనానికి నంబర్ ప్లేట్ ఉండాలని, నంబర్ లేకుండా వాహనాలు రోడ్ల పైకి వస్తే సీజ్ చేస్తామని స్టేషన్ హౌస్ ఆఫీసర్ కె.సతీష్ హెచ్చరించారు. పట్టణంలోని గాంధీ సెంటర్‌లో బుధవారం సిబ్బందితో కలసి వాహన తనిఖీలు నిర్వహించారు. ఇందులో భాగంగా నంబర్ ప్లేట్లు లేని వాహనాలను గుర్తించి, వాహనాలను స్టేషన్‌కు తరలించారు. అనంతరం వాహనదారులకు కౌన్సెలింగ్ నిర్వహించి మొదటి తప్పుగా భావించి హెచ్చరికలతో సరిపెడుతున్నామన్నారు. ప్రతి వాహనానికి రవాణా శాఖ నంబర్ కేటాయిస్తుందని, సంబంధిత వాహనానికి సంబంధిత నంబర్ ప్లేట్ ఉండి తీరాలని, ఈ నిబంధనను మీరితే వాహనాన్ని సీజ్ చేసేందుకు కూడా వెనుకాడబోమని హెచ్చరించారు. ప్రతి చోదకుడు విధిగా రవాణా శాఖ నిబంధనలు పాటించాలని సూచించారు.

హుండీ కానుకల ద్వారా రూ.రెండు లక్షల ఆదాయం

ముక్త్యాల(జగ్గయ్యపేట): గ్రామంలో వేంచేసియున్న భవానీ ముక్తేశ్వర స్వామి వారికి భక్తులు సమర్పించిన హుండీ కానుకల ద్వారా రూ.రెండు లక్షల ఆదాయం సమకూరిందని ఈవో నాగరాజు తెలిపారు. ఆలయ ప్రాంగణంలో బుధవారం నిర్వహించిన హుండీ కానుకల లెక్కింపులో పై ఆదాయం వచ్చిందన్నారు. మహా శివరాత్రి సందర్భంగా లడ్డూ, కొబ్బరి చిప్పలు పోగు చేసుకునే బహిరంగ వేలం పాటలకు పాటదారులు రాకపోవటంతో వాయిదా వేసినట్లు తెలిపారు.

బదిలీపై వెళ్తున్న తహసీల్దార్‌కు వీడ్కోలు



జగ్గయ్యపేట: రాష్ట్రంలో ఎస్సీ, ఎస్టీ వర్గాలకు ప్రాధాన్యం ఇస్తున్నది ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మాత్రమేనని ఎస్టీ కమిషన్ సభ్యుడు వడిత్యా శంకర్‌నాయక్ అన్నారు. తహసీల్దార్‌గా పనిచేస్తూ డెప్యూటీ కలెక్టర్‌గా ఉద్యోగోన్నతిపై వెళ్తున్న నాగేశ్వరరావును పట్టణ ఎస్టీ సంఘం ఆధ్వర్యంలో స్థానిక ఆర్‌అండ్‌బీ వసతి గృహంలో బుధవారం ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జూనియర్ అసిస్టెంట్ స్థాయి నుంచి డెప్యూటీ కలెక్టర్ స్థాయికి నాగేశ్వరరావు ఎదిగారన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర, కౌన్సిలర్ వట్టెం మనోహర్, ఎస్టీ సంఘ నాయకులు బద్యా నాయక్, దారావత్ రవీంద్ర, పాండు, ఎంఈవో రవీందర్, శ్యామల, తదితరులు పాల్గొన్నారు.

సర్పంచిని పరామర్శించిన ఎమ్మెల్యే



కంచికచర్ల: ఇటీవల ఆసుపత్రిలో చికిత్స పొంది ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్న మండలంలోని బత్తినపాడు సర్పంచి, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు జంగా సంతోషరావును బుధవారం ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్ మోహనరావు పరామర్శించారు. కార్యక్రమంలో ఎంపీపీ షేక్ మలక్‌బషీర్, మాజీ ఎంపీటీసీ సభ్యులు వేల్పుల శ్రీనివాసరావు, బుద్ది సత్యనారాయణ, సొసైటీ అధ్యక్షుడు మంగిశెట్టి పుల్లారావు నాయకులు చింతా రవీంద్రనాథ్, రాయల నరసింహారావు, బళ్లా రాములు తదితరులు ఉన్నారు.

నేడు నందిగామలో మెగా జాబ్ మేళా

నందిగామ టౌన్: రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, శాసనసభ్యుడు డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జాబ్‌మేళాను నిరుద్యోగులు సద్వినియోగం చేసుకోవాలని శాసనమండలి సభ్యుడు డాక్టర్ మొండితోక అరుణకుమార్ అన్నారు. స్థానిక వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో బుధవారం ఆయన మాట్లాడుతూ నిరుద్యోగ యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సహకారంతో రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో పలు ప్రముఖ కంపెనీలతో జాబ్‌మేళాలు నిర్వహిస్తారన్నారు. కేవీఆర్ కళాశాలలో గురువారం జరగనున్న జాబ్ మేళాలో ఆయా రంగాలకు సంబంధించిన 18 కంపెనీల ప్రతినిధులు పాల్గొంటారని తెలిపారు. పదవ తరగతి, ఇంటర్మీడియెట్, డిగ్రీ, ఐటీఐ, డిప్లొమా, బీటెక్, పోస్ట్ గ్రాడ్యుయేషన్, ఫార్మసీ ఉత్తీర్ణులైన వారు జాబ్‌మేళాలో పాల్గొనాలని కోరారు.

యువకుడి అదృశ్యంపై కేసు నమోదు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): యువకుడు అదృశ్యమైన ఘటనపై కొత్తపేట పోలీసులు బుధవారం కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం నైజాంగేటు రెహమాన్ వీధికి చెందిన సయ్యద్ అక్బర్ చిన్న కుమారుడు సయ్యద్ హర్షద్ ఈ నెల 21వ తేదీ తెల్లవారుజామున ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. బంధువులు స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేశారు.

ఓటు విలువను ప్రతి ఒక్కరూ గుర్తించాలి



నందిగామలో సీనియర్ సిటిజన్లను సన్మానిస్తున్న ఆర్డీవో రవీంద్రరావు



మాగల్లు గ్రామంలో ప్రతిజ్ఞ చేస్తున్న కేడీసీసీ బ్యాంక్ డైరెక్టర్, గ్రామస్తులు



వత్సవాయిలో సీనియర్ ఓటర్లను సన్మానిస్తున్న ఎంపీడీవో ప్రసాద్

నందిగామ: ప్రతి ఒక్కరూ ఓటు విలువను గుర్తించాలని ఆర్డీవో రవీంద్ర రావు సూచించారు. పట్టణంలోని ఆర్డీవో కార్యాలయ ఆవరణలో జాతీయ ఓటరు దినోత్సవాన్ని పురస్కరించుకొని బుధవారం పలు కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు ఎంతో విలువైనదని, దాని విలువ ప్రతి ఒక్కరూ తెలుసుకుని ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఓటు హక్కుకు అర్హులైన ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా ఓటు నమోదు చేయించుకోవాలన్నారు. అనంతరం రంగవల్లుల పోటీలు, ఓటు హక్కు అంశంపై విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించి ప్రతిభ కనబరిచిన వారికి బహుమతులను అందజేశారు. ఆ తర్వాత పలువురు సీనియర్ సిటిజన్లను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో తహసీల్దార్ నరసింహారావు, ఎస్‌హెచ్‌ఓ సతీష్, అధికారులు పాల్గొన్నారు.

మాగల్లులో...

మాగల్లు గ్రామంలో జాతీయ ఓటరు దినోత్సవాన్ని పురస్కరించుకుని కేడీసీసీ బ్యాంక్ డైరెక్టర్ కొమ్మినేని రవిశంకర్ ఆధ్వర్యంలో పలువురు సీనియర్ సిటిజన్ లను సత్కరించారు. అనంతరం ఓటు హక్కు వినియోగంపై ప్రతిజ్ఞ చేశారు. పలు గ్రామాలలో జాతీయ ఓటరు దినోత్సవాన్ని పురస్కరించుకొని సీనియర్ సిటిజన్‌లను సత్కరించారు.

ఓటు హక్కు అమూల్యం

వత్సవాయి: సమాజంలో ఓటు హక్కు ఎంతో అమూల్యమైనదని, దానిని ప్రతిఒక్కరూ సక్రమంగా సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో ఎస్వీ ప్రసాద్ సూచించారు. జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని బుధవారం ఆయా పోలింగ్‌స్టేషన్ల వద్ద బూత్ లెవల్ ఆఫీసర్ల ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల విద్యార్థులకు ముగ్గుల పోటీలు ఏర్పాటు చేశారు. వత్సవాయిలోని జిల్లా పరిషత్ పాఠశాల ఆవరణలో ముగ్గుల పోటీలను నిర్వహించారు. ఓటర్లతో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ ఓటు హక్కును ప్రతి ఒక్కరూ విధిగా ఉపయోగించుకోవాలని తెలిపారు. అనంతరం సీనియర్ ఓటర్లను సన్మానించారు. కార్యక్రమంలో ఎంఈవో ఎల్.నాగరాజు, డీటీ రవి, ఆర్‌ఐ ప్రభుకుమార్, వీఆర్వో, పరమేష్, యేశపోగు రవి తదితరులు పాల్గొన్నారు.

ప్రజాస్వామ్యంలో ఓటుకు అత్యంత ప్రాధాన్యం

పెనుగంచిప్రోలు: ప్రజాస్వామ్య దేశంలో ఓటుకు అత్యంత ప్రాధాన్యం ఉందని తహసీల్దార్ కె.లక్ష్మీకల్యాణి తెలిపారు. జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా బుధవారం స్థానిక కేవీఆర్ జెడ్పీ హైస్కూల్‌తో పాటు మండలంలోని పలు గ్రామాల్లో వివిధ కార్యక్రమాలు నిర్వహించారు. కేవీఆర్ జెడ్పీ పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో సీనియర్ ఓటర్లను శాలువాలతో ఘనంగా సన్మానించారు. ముందుగా ఓటరు ప్రతిజ్ఞ, మానవహారం నిర్వహించారు. పలు అంశాల్లో నిర్వహించిన పోటీల్లో విజేతలను, పని తీరు బాగా ఉన్న వీఆర్‌ఓ, వీఆర్‌ఏ, బీఎల్‌ఓలను ప్రశంసాపత్రాలతో సత్కరించారు. ఈ సందర్భంగా తహసీల్దార్‌తో పాటు ఎంపీపీ మార్కపూడి గాంధీ, సర్పంచ్ వేల్పుల పద్మకుమారి మాట్లాడుతూ ప్రజా ప్రతినిధులను ఎన్నుకోవటం రాజ్యాంగం కల్పించిన అద్భుత కానుకగా భావించాలన్నారు. కార్యక్రమంలో మండల పరిషత్ కార్యాలయ ఏఓ కె.లక్ష్మీరెడ్డి, హెచ్‌ఎం కె.జలజ, ఆర్‌ఐ జనార్ధనరావు, మండల సమాఖ్య అధ్యక్షురాలు కాకాని పద్మ, వీఆర్‌ఓలు, రెవెన్యూ సిబ్బంది, ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు. గ్రామాల్లో సర్పంచ్‌ల ఆధ్వర్యంలో జాతీయ ఓటర్ల దినోత్సవం నిర్వహించటంతో పాటు ముగ్గుల పోటీలు నిర్వహించి బహుమతులు అందించారు. సీనియర్ సిటిజన్లను సన్మానించారు.

నియోజకవర్గ ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ ఆఫీసర్

ఓటు హక్కు ఎంతో విలువైనది

జగ్గయ్యపేట అర్బన్: ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు ఎంతో విలువైనదని పేట అసెంబ్లీ నియోజకవర్గ ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ అధికారి, డీఆర్‌డీఏ పీడీ కె.శ్రీనివాసరావు అన్నారు. ఓటర్ల దినోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఓటుపై అవగాహన కార్యక్రమం జరిగింది. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన ప్రజాస్వామ్యంలో ఓటు ప్రాశస్త్యాన్ని వివరించారు. ప్రజాస్వామ్య పరిరక్షణకు ప్రతిఒక్కరూ కృషిచేయాలన్నారు. అనంతరం ప్రతిజ్ఞ చేయించారు. సీనియర్ సిటిజన్స్‌ను సత్కరించారు. వక్తృత్వ, వ్యాసరచన, ముగ్గుల పోటీలలో గెలుపొందిన బాలబాలికలకు, ఉత్తమ బీఎల్వోలకు బహుమతులు అందజేశారు. తహసీల్దార్ కె.నాగేశ్వరరావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఎంఈవో రవీంద్ర, ఎలక్షన్ డీటీ సురేష్, సూపరింటెండెంట్ నాగరాజు, ఆర్‌ఐ ఆనంద్, వీఆర్వోలు, వివిధ కళాశాలల విద్యార్థినీ విద్యార్థులు, మున్సిపల్, వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు, బీఎల్‌వోలు, వార్డుల సచివాలయాల సెక్రటరీలు, వలంటీర్లు పాల్గొన్నారు.



నరసింహారావుపాలెం గ్రామంలో సీనియర్ సిటిజన్‌ను సత్కరిస్తున్న బొమ్మిశెట్టి తదితరులు



పేటలో ఉత్తమ సేవలందించిన బీఎల్‌ఓలకు ప్రశంసాపత్రం అందజేస్తున్న తహసీల్దార్

ఓటు హక్కు బలమైన ఆయుధం

కంచికచర్ల: సమాజంలో ఓటుహక్కు బలమైన ఆయుధమని పంచాయతీ కార్యదర్శులు కనగాల రవికుమార్, జిల్లేపల్లి రత్నాకర్ అన్నారు. కంచికచర్ల, గండేపల్లి తదితర గ్రామాల్లో బుధవారం జాతీయ ఓటర్ల దినోత్సవ కార్యక్రమం జరిగింది. ముందుగా మహిళలు వేసిన ఓటర్ల దినోత్సవం ముగ్గును పరిశీలించారు. అనంతరం వారు మాట్లాడుతూ 18 ఏళ్లు నిండిన ప్రతిఒక్కరూ ఓటర్లుగా నమోదు చేసుకోవాలన్నారు. నూతనంగా ఓటు హక్కు పొందిన వారికి ఓటరు కార్డులు అందజేశారు. ఓటర్ల దినోత్సవం సందర్భంగా విద్యార్థులకు వ్యాసరచన, క్విజ్ పోటీలు నిర్వహించారు. విజేతలకు బహుమతులు, ప్రశంసాపత్రాలను అందజేశారు. కార్యక్రమంలో స్కూల్ హెచ్‌ఎం రామకృష్ణ, వీఆర్వో కాంతారావు, రాము తదితరులు పాల్గొన్నారు. మండలంలోని కొత్తపేట, పరిటాల, చెవిటికల్లు వేములపల్లి, ఎస్. అమరవరం, కీసర గ్రామాల్లో ఓటర్ల దినోత్సవం కార్యక్రమం జరిగింది. ముందుగా ఆయా గ్రామాల్లో ఎక్కువసార్లు ఓటుహక్కు వినియోగించుకున్న సీనియర్ సిటిజన్‌లను సర్పంచులు ప్రత్తిపాటి సునీత, యద్దనపూడి ఆనందజ్యోత్స్న, బుడ్డి విజయలక్ష్మి, ఉయ్యూరు అనుమాయమ్మ, కోదాటి సీతారాం, పేరం నర్సమ్మ శాలువాలతో సత్కరించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు, వీఆర్వోలు పాల్గొన్నారు.



గండేపల్లిలో సీనియర్ సిటిజన్‌లను సత్కరిస్తున్న పంచాయతీ కార్యదర్శి, వీఆర్వో తదితరులు



పెనుగంచిప్రోలులో బహుమతి ప్రదానం చేస్తున్న తహసీల్దార్, ఎంపీపీ, సర్పంచ్ తదితరులు

ఘనంగా జాతీయ ఓటరు దినోత్సవం

నరసింహారావుపాలెం(వీరులపాడు): ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటు హక్కు ఎంతో విలువైనదని ఏఎంసీ మాజీ చైర్మన్ బొమ్మిశెట్టి భాస్కరరావు అన్నారు. మండలంలోని నరసింహారావుపాలెం గ్రామంలోని సచివాలయం వద్ద జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. ముందుగా సీనియర్ సిటిజన్స్‌ను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఓటు హక్కును తప్పనిసరిగా వినియోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ బొమ్మిశెట్టి దుర్గాదేవి, ఎంపీటీసీ సభ్యుడు శీలం రమణారెడ్డి, గ్రామ నాయకుడు పచ్చాల కోటేశ్వరరావు, పలువురు నాయకులు పాల్గొన్నారు. మండలంలోని జయంతి, పొన్నవరం గ్రామాల్లో జాతీయ ఓటరు దినోత్సవం ఘనంగా నిర్వహించారు. అనంతరం ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు మారపాక మహాలక్ష్మి, షోడగిరి రాజశ్రీ, ఎంపీటీసీ సభ్యుడు ఇప్పల సత్యనారాయణ రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ జంగా కోటిరెడ్డి, నాయకులు అచ్చయ్య, సతీష్, పలువురు నాయకులు పాల్గొన్నారు.

సచివాలయం ఆకస్మిక తనిఖీ చేసిన కమిషనర్



నందిగామ: సచివాలయ సిబ్బంది సమయపాలన పాటించాలని నగర పంచాయతీ కమిషనర్ డాక్టర్ జయరాం అన్నారు. పట్టణంలోని ఐదవ నంబరు సచివాలయాన్ని బుధవారం ఆయన ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. సచివాలయంలో సిబ్బంది పనితీరు, నోటీస్ బోర్డులో ఉన్న అంశాలు, స్థానికులకు అందిస్తున్న సేవలు, పెండింగ్‌లో ఉన్న సమస్యలు తదితర అంశాలపై సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సచివాలయంలో పనిచేస్తున్న ప్రతి ఒక్కరూ సమయపాలన పాటించడంతో పాటు సచివాలయానికి వచ్చే వారితో మర్యాదపూర్వకంగా నడుచుకోవాలన్నారు. ముఖ్యంగా సచివాలయ పరిధిలో సమస్యలను వెంటనే పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఆయన వెంట పలువురు మునిసిపల్ అధికారులు పాల్గొన్నారు.

నిత్యాన్నదానానికి రూ.10,116 విరాళం



పెనుగంచిప్రోలు: గ్రామంలో ఉన్న శ్రీతిరుపతమ్మవారి ఆలయంలో నిత్యాన్నదాన పథకానికి బుధవారం బాపట్ల జిల్లా వేమూరు మండలం పెరవలి గ్రామానికి చెందిన గాజుల మార్కండేయులు, లక్ష్మీతిరుపతమ్మ దంపతులు రూ.10,116 ఆలయ సూపరింటెండెంట్ సునీత చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ అధికారులు దాతలను అమ్మవారి శేషవస్త్రం, ప్రసాదాలతో సత్కరించారు.

చికిత్స పొందుతూ వృద్ధుని మృతి

కంచికచర్ల: ఆగి ఉన్న బైక్‌పై కూర్చున్న వ్యక్తిని గేదెలు వచ్చి తగలడంతో రోడ్డుపై పడి తీవ్రగాయాలై ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందిన సంఘటన బుధవారం జరిగింది. ఎస్‌ఐ పీఎస్ సుబ్రహ్మణ్యం కథనం మేరకు నందిగామ నేతాజీ నగర్‌కు చెందిన షేక్ సైదులు(62) తన బంధువుతో కలసి మండలంలోని మోగులూరు గ్రామానికి బైక్‌పై మంగళవారం సాయంత్రం బయలుదేరారు. కంచికచర్ల చెరువుకట్ట సమీపంలో అండర్ పాస్ రోడ్డు వద్ద బైక్ ఆపారు. అదే సమయంలో గేదెలు వచ్చి బైక్‌కు తగలగా సైదులు కిందపడి తీవ్రగాయాలపాలయ్యాడు. స్థానికులు వెంటనే ప్రయివేటు వాహనంపై చికిత్స కోసం బాధితుడిని విజయవాడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మృతిచెందాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

ప్లాస్టిక్ రహిత నందిగామకు ప్రజలు సహకరించాలి

కమిషనర్ జయరాం



ప్రజల సమస్యలు తెలుసుకుంటున్న కమిషనర్ జయరాం

నందిగామ: ప్లాస్టిక్ రహిత నందిగామ సాధన లక్ష్యంగా నగర పంచాయతీ తీసుకుంటున్న చర్యలకు ప్రజలు సహకరించాలని నగర పంచాయతీ కమిషనర్ జయరాం సూచించారు. పట్టణంలోని 1వ వార్డులో బుధవారం ఆయన పర్యటించారు. ఇందులో భాగంగా వార్డులో జరుగుతున్న పారిశుద్ధ్య పనులను పరిశీలించి సిబ్బందికి తగిన సూచనలు చేశారు. ప్రజలను సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్లాస్టిక్ వాడకం వల్ల పర్యావరణానికి పెను విఘాతం కలుగుతోందని, ప్రజలు స్వచ్ఛందంగా ప్లాస్టిక్ వినియోగాన్ని విడనాడాలన్నారు. క్యారీ బ్యాగ్‌లు, ఇతరత్రా ప్లాస్టిక్ వస్తువుల వినియోగాన్ని నిలిపివేసి, వాటి స్థానంలో పర్యావరణ హిత బ్యాగ్‌లు ఉపయోగించాలన్నారు.నగర పంచాయతీ పరిధిలోని వ్యాపారులు క్యారీ బ్యాగ్‌లు, ప్లాస్టిక్ ప్లేట్లు, గ్లాసులు వంటివి విక్రయిస్తే భారీ మొత్తంలో జరిమానా విధిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

నేటి నుంచి ప్లాస్టిక్ నిషేధంపై కఠినమైన నిబంధనలు

కంచికచర్ల: ఈ నెల 26వ తేదీ నుంచి ప్లాస్టిక్ నిషేధంపై ప్రభుత్వం కఠినమైన నిబంధనలు అమలు చేస్తుందని, ప్లాస్టిక్ వాడకాన్ని పూర్తిగా తగ్గించాలని పంచాయతీ కార్యదర్శి కనగాల రవికుమార్ తెలిపారు. మండల కేంద్రమైన కంచికచర్లలో ప్లాస్టిక్ నియంత్రణ చేపట్టాలని విజ్ఞప్తి చేస్తూ బుధవారం పలు ప్రధాన కూడళ్లలో క్లాత్ ఫ్లెక్సీలను ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా రవికుమార్ మాట్లాడుతూ ప్లాస్టిక్ బ్యానర్లపై పట్టణంలో నిషేధం అమలు చేస్తున్నట్లు తెలిపారు. ఈనెల 26వ తేదీ నుంచి ప్లాస్టిక్ బ్యానర్లు వాడినా, ప్లాస్టిక్ సంచులు అమ్మినా వారికి భారీగా జరిమానా విధిస్తామన్నారు. ప్రభుత్వ ఆదేశానుసారం 120 మైక్రాన్ల కన్నా తక్కువ మందం కలిగిన ప్లాస్టిక్ సంచులు వస్తువులు తయారు చేయటం, అమ్మటం, వినియోగించటం చట్టరీత్యా నేరమన్నారు. నిబంధనలు అతిక్రమించిన వారికి రూ.లక్ష జరిమానా విధించటంతో పాటు వ్యాపార లైసెన్స్‌ను రద్దు చేస్తామని హెచ్చరించారు. అంతేకాకుండా పర్యావరణ పరిరక్షణ చట్టం కింద కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. పట్టణంలో మేక్ ప్లాస్టిక్ ఫ్రీ కంచికచర్ల అనే నినాదంతో ముందుకు పోతున్నామన్నారు. ప్రతి గ్రామ సచివాలయంలో సిబ్బంది, వలంటీర్లు, పొదుపు సంఘాల సభ్యులకు ప్లాస్టిక్ నిషేధంపై అవగాహన కల్పిస్తున్నామన్నారు. ప్లాస్టిక్ నిషేధంపై బ్యానర్ల నిషేధంపై పట్టణంలో ఇప్పటికే మైకు ద్వారా అవగాహన కల్పించామని చెప్పారు. జాతీయ రహదారులు, అంతర్గత రహదార్లకు ఇరువైపులా ఉన్న వ్యాపార సంస్థల యజమానులు తప్పనిసరిగా చెత్త బుట్టలను ఏర్పాటు చేసుకోవాలన్నారు. ఎక్కడబడితే అక్కడ చెత్తను రోడ్లపై వేయరాదన్నారు. నిషేధం అమలుపై ప్రతి గ్రామ సచివాలయంలో ప్రత్యేకంగా టాస్క్‌ఫోర్స్ కమిటీని ఏర్పాటు చేశామని, సదరు టాస్క్‌ఫోర్స్ కమిటీ వారు వారి సచివాలయం పరిధిలోని షాపులు, వ్యాపార సంస్థల్లో తనిఖీలు నిర్వహించి ప్లాస్టిక్ కవర్లు ఉన్నట్లైతే జరిమానాలు విధిస్తారని తెలిపారు. పట్టణంలోని వర్తక వాణిజ్య సముదాయాల యజమానులు, ఫ్లెక్సీ బ్యానర్లు, ప్రింటు చేసే యజమానులు ప్రభుత్వ నియమ నిబంధనలు తప్పక పాటించాలని, లేనిపక్షంలో జరిమానాలు విధించటంతో పాటు షాపుల వ్యాపార లైసెన్స్‌లను రద్దు చేయడానికి చట్టపరమైన చర్యలు తీసుకుంటామని రవికుమార్ హెచ్చరించారు.



కంచికచర్లలో ప్లాస్టిక్‌ను నిషేధించాలని క్లాత్ ఫ్లెక్సీని ఏర్పాటు చేసిన పంచాయతీ అధికారులు

రాష్ట్ర స్థాయి ఈత పోటీలకు ఎంపికైన జెడ్పీ స్కూల్ విద్యార్థి



గనిఆత్కూరు జెడ్పీ హైస్కూల్ విద్యార్థి పవన్‌రామ్‌తో హెచ్‌ఎం రంగారావు, పీడీ నాగమల్లేశ్వరరావు

గనిఆత్కూరు(కంచికచర్ల): ప్రభుత్వ పాఠశాలలో నాణ్యమైన విద్యనందించటంతో పాటు పలు క్రీడా విభాగాల్లో మెరుగైన తర్ఫీదు ఇస్తున్నామని ప్రధానోపాధ్యాయుడు ఎంవీ రంగారావు అన్నారు. మండలంలోని గనిఆత్కూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదువుతున్న కన్నా పవన్‌రామ్ ఉమ్మడి జిల్లాలో నిర్వహించిన ఈత పోటీలో ప్రతిభ కనపరిచి, త్వరలో రాష్ట్రస్థాయిలో జరిగే ఈత పోటీలకు ఎంపికయ్యాడు. ఈ సందర్భంగా బుధవారం ఉపాధ్యాయులు పవన్‌రామ్‌ను అభినందించారు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో ఈనెల 24న కృష్ణాజిల్లా ఈడ్పుగల్లులో నిర్వహించిన సాఫ్ స్విమ్మింగ్ పోటీలలో పవన్‌రామ్ 50 మీటర్ల బ్యాక్ స్ట్రోక్ విభాగంలో ద్వితీయ స్థానం, 100 మీటర్ల బ్యాక్ స్ట్రోక్ విభాగంలో మొదటి స్థానం సాధించాడు. హెచ్‌ఎం రంగారావు, వ్యాయామోపాధ్యాయుడు చింతల నాగమల్లేశ్వరరావు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పవన్‌రామ్‌ను అభినందించిన వారిలో ఉన్నారు.

గిరిజన వసతి గృహాల అభివృద్ధికి కృషి

రాష్ట్ర ఎస్టీ కమిషన్ సభ్యుడు వడిత్యా శంకరనాయక్



గిరిజన బాలుర సంక్షేమ వసతి గృహం వంటశాలలో పరిశీలిస్తున్న ఎస్టీ కమిషన్ సభ్యుడు శంకర్ నాయక్

జగ్గయ్యపేట: రాష్ట్రంలో గిరిజన వసతి గృహాల అభివృద్ధికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎంతో కృషి చేస్తున్నారని రాష్ట్ర ఎస్టీ కమిషన్ సభ్యుడు వడిత్యా శంకర్ నాయక్ అన్నారు. పట్టణంలోని గిరిజన సంక్షేమ శాఖ బాలుర వసతి గృహాన్ని బుధవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన వసతి గృహంలోని గదులు, మరుగుదొడ్లు, వంటశాల, వంట సామగ్రిని పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ పేదవాని ఆస్తి చదువు మాత్రమేనని, ఆ చదువు కోసం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేస్తున్న కృషి అమోఘమైనదన్నారు. వసతి గృహాలలో ఖాళీగా ఉన్న ఉద్యోగాలను యుద్ధ ప్రాతిపదికన భర్తీ చేస్తున్నామన్నారు. సంక్షేమ వసతి గృహాలలో నాడు-నేడు పథకం ద్వారా కూడా అన్ని మౌలిక వసతులు కల్పిస్తున్నామని తెలిపారు. అనంతరం విద్యార్థులతో కలిసి ఆయన మధ్యాహ్న భోజనం చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర, జిల్లా గిరిజన సంక్షేమ శాఖాధికారి రుక్మాంగదయ్య, వార్డెన్ చదల శ్రీనివాసరావు, మహిళా సమాఖ్య అధ్యక్షురాలు శ్యామల, తహసీల్దార్ నాగేశ్వరరావు, వైఎస్సార్ సీపీ పట్టణ కన్వీనర్ ఆకుల బాబ్జీ, ఎస్టీ సెల్ కన్వీనర్ బద్యా నాయక్, కౌన్సిలర్ వట్టెం మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

ఫిబ్రవరి 12న జాతీయ రహదారి దిగ్బంధం



కంచికచర్ల మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న కృష్ణమాదిగ

ఎమ్మార్పీఎస్ జాతీయ అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ

కంచికచర్ల: ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత కల్పించే విషయంలో కేంద్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమయిందని మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి (ఎమ్మార్పీఎస్) జాతీయ అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ అన్నారు. కంచికచర్ల మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో బుధవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ మేరకు కృష్ణమాదిగ మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత కల్పించే విషయంలో విఫలమైందని కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఫిబ్రవరి 12 తేదీన ఉదయం 10గంటల నుంచి రాత్రి వరకు హైదరాబాద్- విజయవాడ జాతీయ రహదారిని ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ, ఎంఎస్ఎఫ్, అనుబంధ సంఘాల నాయకులు, కార్యకర్తలు దిగ్బంధనం చేస్తారన్నారు. కార్యక్రమంలో ఎన్టీఆర్ జిల్లా కన్వీనర్ యండ్రాతి కోటేశ్వరరావు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పేరెల్లి ఎలీషా, ఉమ్మడి జిల్లాల సమన్వయకర్త వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెస్కేను సత్కరించిన చైర్మన్ రాఘవేంద్ర



బీసీసీఐ సెలక్షన్ కమిటీ మాజీ చైర్మన్ ఎమ్మెస్కే ప్రసాద్‌ను సన్మానిస్తున్న మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్లు రాఘవేంద్ర, ప్రభాకర్ తదితరులు

జగ్గయ్యపేట అర్బన్: బీసీసీఐ సెలక్షన్ కమిటీ మాజీ చైర్మన్, ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ ఆపరేషన్స్ డైరెక్టర్ ఎంఎస్‌కె.ప్రసాద్‌ను బుధవారం జగ్గయ్యపేట మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర, వైస్‌చైర్మన్ తుమ్మల ప్రభాకర్ తదితరులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఆయన హైదరాబాద్ నుంచి గుంటూరు వెళుతూ మార్గమధ్యంలో 65 వ నంబర్ జాతీయ రహదారిపై పేట పట్టణ సమీపంలోని ఫుడ్‌ప్లాజా వద్ద ఆగారు. ఈ విషయం తెలుసుకున్న మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్ తదితరులు ఆయన్ను కలిసి పుష్పగుచ్ఛాన్ని అందజేసి సత్కరించారు. కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్ వట్టెం మనోహర్, వైఎస్సార్ సీపీ నాయకుడు తన్నీరు నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.

- చిట్టినగర్(విజయవాడపశ్చిమ): వివాహితను వేధింపులకు గురి చేస్తున్న అత్తింటి వారి పై కొత్తపేట పోలీసులు బుధవారం కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం కేఎల్ రావునగర్‌కు చెందిన శీల గౌరీకి చీరాలకు చెందిన మేంద్రగుత్తి బాలరాజుతో వివాహం అయింది. అయితే అత్తింటి వేధింపులకు గురి చేయడంతో బాధితురాలి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.